జ్ఞాన:

# బావ

చెరుకువాడ
శ్రీరామమూర్తి

బావ చాలా మంచాడు. అమ్మా నాన్నా కాదంటారు. కాని ఎదురుగుండా మాత్రం అలా అనలేరు.

నేను సెలవులకు బావఊరు వెళ్లినప్పుడు ఎంతో బావుండేది. మాతోటలోనికి వెళ్లి జామిచెట్టు మీద కూర్చొని కాయలు తింటుంటే ఎంతో సరదాగా ఉండేది. తోటమాలి అప్పన్న చూస్తే "చిన్నబాబూ చిటారి కొమ్మమీద కూర్చున్నావు భద్రం!" అనేవాడు! వాడలా అంటుంటే నాకు నవ్వొచ్చేది.

సాయింతరము ఇంటికి వెళ్లగానే బావ 'టేబిలి మీద మిఠాయి ఉంది తీసికోవోయ్" అనేవాడు.

అక్కయ్య చచ్చిపోయినా బావ పెళ్లాడలేదు. అలా మంచివాళ్లు చేస్తారట! అమ్మా నాన్నా, బావ అక్కయ్యన్ని అనవసరంగా కొట్టేవాడని ముండల ముఠాకోరని తిట్టేవారు. ఆఖరిమాటకు నాకు అర్థం తెలిసేది కాదు.

బావ మా ఊరు వచ్చినప్పుడు ఎంతో ఇధిగా చూచేవారు. రకరకాల పిండివంటలు, కూరలు చేసేవారు. బావ ఉన్నన్నాళ్లు అమ్మ "ఎప్పుడు విరగడైపోతాడో?" అని తిట్టేది. నాకు కోపం వచ్చేది పైకి అంత గౌరవంగా చూచి, లోపల తిట్టుకోవడం చూస్తే! బావకు చెప్పేద్దామనుకొనే వాడినిగాని, అమ్మ కొడుతుందని భయం!

రమ్మని టెలిగ్రాము వస్తే అందరము బావఊరు వెళ్ళాము. మరునాడు బావ ఏదో కాగితము తెచ్చి నాన్నని సంతకం పెట్టమన్నాడు. నాన్న వప్పుకోలేదు.

"మరి బాకీ ఎలా తీరుతుందనుకొన్నారు?" అన్నాడు బావ!

నాన్న బావకు బాకీ ఉన్నాడన్నమాట! అందుకే నాన్న బావ మంచాడు కాదంటాడు. ఆ సంగతి బావతో చెప్పేద్దా మనుకొన్నాను. కాని బావ కళ్లు ఎఱ్ఱగా ఉన్నాయి! భయమేసి కళ్లు మూసుకొన్నాను.

బావ వెళ్ళిపోయినాక "బావ అలా చూశాడేం నాన్నా?" అన్నాను. అయన విసుక్కొన్నాడు. అమ్మ కన్నీళ్లు పెట్టుకొంది.

నా కదోలా అయి ఆడుకొంటానికి వెళ్ళిపోయాను.

ఇంటికి వెళ్ళాక అమ్మా నాన్నా బావను చాలా చాలా అన్నారు.

"మన్ని తినేస్తున్నాడు" అన్నాడు నాన్న.

"దుర్మార్గుడు! అనుభవిస్తాడు" అంది అమ్మ.

దసరా సెలవులకు బావ ఊరు వెళ్ళాను. బావ ఇంటిలో ఎవరో పెద్దమ్మాయి ఉంది. 'ఎవరని' బావ నడిగితే 'మీ అక్క' అన్నాడు. "మన చుట్టాలే?" అన్నాను. బావ నవ్వి ఊరుకొన్నాడు. బావ ఇంటిలో ఉన్నప్పుడు ఆమె నాతో నవ్వుతూ కబుర్లు చెప్పేది. లేనప్పుడు విసుక్కునేది నామీద.

నాకు కోపంవచ్చి బావతో చెప్పితే నామీదే కోప్పడ్డాడు.

నాకు ఆశ్చర్యం వేసింది. అమ్మా నాన్నా అన్నట్టు బావ మంచాడు కాదేమొ?

రోజు అన్నం తినేముందు బావ సోడా త్రాగేవాడు!

ఒకసారి చూశాను. ఆ అమ్మాయి గ్లాసులోనికి, బ్రాందీ వంపి, సోడా కలిపి బావ కివ్వడం! అంతకు ముందు తెలియదు బావ త్రాగుతాడని!

ఆవాళ నాకు మిఠాయి పెట్టలేదు. కిటికీలో నించి చూశాను, ఆ అమ్మాయి, బావ మిఠాయి తినడం!

బావమీద చాలా కోపం వచ్చింది. ఏమీ తోచక నిద్రపోయాను.

మరునాడు తోటలోనికి బయలుదేరాను. దారిలో ఎదురయ్యాడు అప్పడు.

"తోటకి వెళదాము పదరా!" అన్నా.

"తోటకీ నాకు ఋణం తీరిపోయింది బాబు" అన్నాడు అప్పడు.

"నిన్ను తీశేశారా! నాన్నతో చెప్పి మళ్ళా పని ఇప్పిస్తాలే!" అన్నాను.

"కాదు చిన్నబాబు! మీ బావగారు తోట అమ్మేశారు"

"ఆ!"

బావ మంచాడు కాడేమొ?